
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

సోమవారం 15 సెప్టెంబరు 2025

సంగారెడ్డిలో మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

యువత చేసిన అలంకరణలు చూసి వారిని అభినందించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఆదివారం జరిగిన 'మిలాద్ ఉన్ నబీ' వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని ఆయా దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డిని ముస్లిం మత పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, కూన సంతోశ్‌కుమార్, కిరణ్‌గౌడ్, మహేశ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.





మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డి, వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డిని సన్మానిస్తున్న యువత

దిగుబడి దిగులు

- సకాలంలో ఎరువు అందక ఎర్రబారుతున్న పంటలు

7



శ్రీహరి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు పొన్నం, లక్ష్మణ్ కుమార్

నిబద్ధత గల నాయకుడు కర్ర శ్రీహరి

- మంత్రులు పొన్నం, లక్ష్మణ్

కోహెడ/హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత గల రాజకీయ నాయకుడు కర్ర శ్రీహరి అని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం కోహెడ మండలం శనిగారంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సతీమణి, కుమారులను పరామర్శించి ఓదార్చారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కూడా శ్రీహరి పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం శ్రీహరి అంతిమ యాత్రలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కమలాకర్ పాడె మోశారు.

కేసీఆర్ సంతాపం...

బీఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి, ఉద్యమకారుడు కర్రశ్రీహరి మృతిపట్ల పార్టీఅధినేత కేసీఆర్ ఆదివారం సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీహరితో తనకున్న ఉద్యమ, రాజకీయ అనుబంధాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. నాలుగు దశాబ్దాలపాటు సర్పంచ్, పాక్స్ చైర్మన్, ఎంపీపీ, జడ్పీటీసీగా ఎన్నో పదవుల్లో ప్రజాసేవ చేస్తూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో ఆయన తనదైన ముద్రవేశారని కొనియాడారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి ఆయన మృతి తీరనిలోటని కేటీఆర్, హరీశ్‌రావు పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పాడె మోస్తున్న మాజీ మంత్రులు హరీశ్, కమలాకర్

ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు



సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన (డీడీయూజీకేవై) పథకంలో భాగంగా సుమారు 100 మంది శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులు ఉద్యోగాల కోసం హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆదివారం బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ విద్యార్థులు వెళ్లే బస్సును జెండా ఊపి ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేశారు. యువతకు ఉపాధి ఉద్యోగ కల్పన కోసం ఈ పథకాన్ని మోడీ ప్రభుత్వం అమలు చేస్తుందని శంకర్ ముదిరాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వేద సొల్యూషన్స్, సాహితి సిస్టమ్స్ సంయుక్తంగా విద్యార్థినులకు మూడు నెలల పాటు డీడీయూజీకేవైలో భాగంగా శిక్షణ అందించారు.

ఆ రెండింటికే పరిమితమా?

- టీయూఎఫ్ఐడీసీ నిధులు రెండు మున్సిపాలిటీలకే..
- సిద్దిపేట, గజ్వేల్‌కు డీపీఆర్ ప్రతిపాదనలు కోరిన ప్రభుత్వం
- దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాలకు మొండిచేయి?
- గత ప్రభుత్వం నుంచి ఊరిస్తున్న నిధులు
- మొదట జిల్లాకు రూ. 75కోట్లకు ప్రతిపాదనలు
- ప్రస్తుతం రూ.30 కోట్లకు కుదింపు

జిల్లాలోని మున్సిపాలిటీలకు టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నిధుల మంజూరు వ్యవహారం ఆందోళన కలిగిస్తోంది. మూడు సంవత్సరాలుగా నిధుల కోసం ఎదురుచూస్తున్న మున్సిపాలిటీలకు ప్రభుత్వం కేవలం గజ్వేల్, సిద్దిపేటకు మాత్రమే నిధులు మంజూరు చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా మున్సిపాలిటీలైన దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల్లో ఆందోళన నెలకొన్నది. గతంలో మొత్తం ఐదు మున్సిపాలిటీలకు నిధులు కేటాయిస్తారని ఆశించినా, ఇప్పుడు కేవలం రెండు మున్సిపాలిటీలకు మాత్రమే నిధులు మంజూరయ్యే అవకాశం కనిపిస్తుండటంతో మిగతా వాటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

- దుబ్బాక, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా, ఎన్నికల కారణంగా ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం మారడంతో నిధుల మంజూరు మొదటికొచ్చింది. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీలకు బడ్జెట్‌లో రూ. 2వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్‌కు నిధుల ప్రతిపాదనలు పంపాలని సూచించింది. జిల్లాకు మొత్తం రూ. 75 కోట్లు కేటాయిస్తారని తొలుత ప్రచారం జరిగింది. దీనితో ఆయా మున్సిపాలిటీలు వార్డుకు రూ. 35 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు వివిధ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేసి ప్రభుత్వానికి పంపించాయి. అయితే, గతంలో పంపించిన ప్రతిపాదనలను రద్దు చేసి, కొత్తగా డీపీఆర్ (వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక) పంపాల్సిందిగా ప్రభుత్వం కోరడంతో గందరగోళం నెలకొన్నది. మున్సిపల్ పాలకమండలి పదవీకాలం ముగిసిన తర్వాతనే నిధులు మంజూరవుతాయని అధికార పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 26న పాలకమండలి పదవీ కాలం ముగియడంతో దుబ్బాకతోపాటు కొన్ని మున్సిపాలిటీల అధికార పార్టీ నాయకులు అధికారులతో కలిసి ప్రతిపాదనలను తయారు చేసి అప్పటి ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు అందజేశారు. హుస్నాబాద్‌లో మాత్రం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగుతోందని చెబుతున్నారు.



దుబ్బాకలోని దుంపలపల్లి రోడ్డు సమీపంలో మురుగు కాలువల పరిస్థితి



దుబ్బాకలోని నీలకంఠేశ్వరాలయం వద్ద గుంతలమయంగా సీసీ రోడ్డు

ప్రతిపక్ష ఎమ్మెల్యేలకే మొండిచేయి?

మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, జంక్షన్‌లు, దుకాణ సముదాయాలు, పార్కులు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపారు. అయితే, ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో



మల్లన్న సన్నిధిలో భక్తజన సందడి

కొమురవెల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధికి భక్తులు భారీగా తరలివచ్చారు. గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖ మండపంలో పంచరంగులతో పట్నాలు వేసి బోనాలు సమర్పించారు. పలువురు భక్తులు స్వామి వారి నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం మల్లికార్జున స్వామిని దర్శించుకుని బండారు, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో టంకశాల వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బొడ్డెమ్మ వైభవం

సంస్కృతీ సంప్రదాయాల పండుగ
తొమ్మిది రోజుల పాటు సందడి
బొడ్డెమ్మతో బతుకమ్మ సంబరాలు ప్రారంభం

7

సిద్దిపేట అభివృద్ధిని కొనసాగిద్దాం : మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అభివృద్ధిని మనమంతా కలిసి ముందుకు తీసుకెళ్దామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి కానీ సిద్దిపేట ప్రజలకు తాము నిత్యం జవాబుదారులమని స్పష్టం చేశారు. కరోనా సమయంలో జర్నలిస్టులు చాలా ఇబ్బందులు పడ్డారని, ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండి చాలామంది జర్నలిస్టులను కాపాడుకున్నామని గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సిద్దిపేటకు వచ్చిన వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడి అభివృద్ధిని చూసి అభివృద్ధి పాఠం, ప్రగతికి ప్రయోగశాలు అని ప్రశంసించారని తెలిపారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తరలించారని, సిద్దిపేట ప్రజల కోసం నిర్మించిన వెయ్యి పడకల ఆసుపత్రి పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని హరీశ్‌రావు ఆరోపించారు. చిన్నకోడూర్ ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం మధ్యలోనే ఆగిందని, రెండేళ్లు గడిచినా ఔటర్ రింగ్ రోడ్డులోని గుంతలను కూడా పూడ్చలేదని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి పైడిపల్లి అరుణ్‌కుమార్, జర్నలిస్టులు రాజిరెడ్డి, అశోక్, రంగధాంపల్లి శ్రీనివాస్, రఘు, మజ్జు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్‌రావు



సమావేశానికి హాజరైన జర్నలిస్టులు

ఈ సారీ..!

- చేప పిల్లల పంపిణీకి ముందుకురాని బిడ్డర్లు
- సిద్దిపేటలో 2, సంగారెడ్డిలో 1, మెదక్‌లో సున్నా బిడ్లు
- గతేడాదీ ఇదే పరిస్థితి
- ముగింపునకు వానాకాలం సీజన్
- మత్స్యకారుల్లో ఆందోళన



మెదక్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో చేప పిల్లల పంపిణీకి గత సంవత్సరం కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఖమ్మం జిల్లాకు చెందిన విజయా ఫిషరీస్ ఏజెన్సీ ద్వారా జిల్లాకు 64.31 లక్షల చేప పిల్లల్ని సరఫరా చేశారు. ఈ సారి కూడా మెదక్ జిల్లాలో చేపపిల్లల్ని పంపిణీ చేసేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాకపోవడంతో మళ్లీ షార్ట్ టెండర్లను పిలిచే అవకాశముంది. టెండర్ ప్రక్రియ ఆన్‌లైన్ పద్ధతిలో సాగుతున్న నేపథ్యంలో టెండర్లలో ఏ ఏజెన్సీ పాల్గొంటుందో తెలిసే వెసులుబాటు లేదు.

ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి

వానాకాలం సీజన్ ముగింపునకు వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉమ్మడి మెదక్ జిల్లాలో జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలో 4.35 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 3.50 కోట్లు, మెదక్ జిల్లాలో 5.30 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. చేప విత్తనం సరఫరా చేయడానికి గత నెల 18 నుంచి 31 వరకు దరఖాస్తులను ఆహ్వానించారు. బిడ్డర్లు ముందుకురాకపోవడంతో తొలుత ఈ నెల 8 వరకు, అనంతరం 12 వరకు గడువు పొడిగించారు. శుక్రవారం టెండర్లను తెరవగా సంగారెడ్డిలో ఒకరు, సిద్దిపేటలో ఇద్దరు టెండర్లు వేశారు. మెదక్ జిల్లాలో ఒక్కరూ బిడ్ దాఖలు చేయలేదు. గతేడాది కూడా బిడ్డర్లు ముందుకు రాకపోవడంతో మెదక్ జిల్లాలో 64.31 లక్షలు, సిద్దిపేటలో 24 లక్షలు, సంగారెడ్డి జిల్లాలో 70 లక్షల పిల్లలను చెరువుల్లో వదిలారు. సీజన్ ముగిసే సమయానికి చేప విత్తనాన్ని వదలడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు.

రెండేళ్లుగా అవాంతరాలు

మెదక్ జిల్లాలో 1,728 చెరువులు ఉండగా, 309 మత్స్యకార సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 16,820 మంది సభ్యులు ఉన్నారు. సిద్దిపేటలో 339 సొసైటీల పరిధిలో 1,200 చెరువులు, 24,500 మంది సభ్యులు, సంగారెడ్డిలో 1,200 చెరువులు, 222 సొసైటీలు, 12,800 మంది మత్స్యకారులు సభ్యులుగా కొనసాగుతున్నారు. రెండేళ్లుగా ఉచిత చేపపిల్లల పంపిణీలో అవాంతరాలు జరుగుతుండటంపై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. సరైన సమయంలో చేపవిత్తనం వేయకపోతే మత్స్యకారులు నష్టాలబారిన పడతారని వాపోయారు. గత సంవత్సరం సైతం చేప విత్తనం మెదక్ జిల్లాకు సరఫరా చేసిన విజయా ఫిషరీస్ ఏజెన్సీకి ఇంకా రూ.80 లక్షల బిల్లు పెండింగు లోనే ఉందని సమాచారం. త్వరితగతిన బిల్లులు చెల్లించకపోవడంతోనే టెండర్లు వేయడానికి గుత్తేదారులు

మిగతా 8వ పేజీలో

లైసెన్స్‌డ్ సర్వేయర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

సిద్దిపేట కల్చరల్/సిద్దిపేటరూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎంపికైన లైసెన్స్‌డ్ సర్వేయర్ల రెండు నెలల శిక్షణ అనంతరం నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ హైమావతి తెలిపారు. ఆదివారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. ఉదయం సెషన్‌లో నిర్వహించిన పరీక్షలో 31 మందికి 31 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించిన పరీక్షలో 52మందికి 51 మంది హాజరయ్యారని తెలిపారు. కలెక్టర్ వెంట ఏడి సర్వే ల్యాండ్ వినయ్ కుమార్, డీఆర్వో నాగరాజమ్మ, డిగ్రీ కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ హైమావతి




రాఘవాపూర్ కస్తూర్బా బాలికల పాఠశాలలో రాత్రి భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించిన కలెక్టర్

సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ కస్తూర్బా బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఆదివారం రాత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాత్రి భోజనానికి చేసిన వంటలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

ఎర్ర జెండాతోనే పేదలకు న్యాయం

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజల పక్షాన నిలబడుతూ..సీపీఐ పోరాడుతుందని, పేదలకు ఎర్రజెండా ఎప్పుడు అండగా ఉంటుందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా ఆదివారం జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ నాయకుడు, ఆ గ్రామ మాజీ సర్పంచ్ కామ్రేడ్ కె.బీమయ్య స్తూప ఆవిష్కరణ చేపట్టారు. ముందుగా గ్రామంలో గాంధీ చౌరస్తా నుంచి స్థూపం వరకు డప్పు చప్పుళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థూప ఆవిష్కరణ చేసి బహిరంగ సభ ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, రిటైర్డ్ జడ్జి జయసూర్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానందరెడ్డి, యెడల వనేశ్, కొమ్ముల భాస్కర్, కిష్టపురం లక్ష్మణ్, జేరిపోతుల జనార్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు శివలింగ కృష్ణ, స్వర్గం రాజేశం, నర్సింహారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాంబశివరావు

ప్రజా ఉద్యమాలతోనే శాస్త్రీయ విద్య సాధ్యం

● టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రజా ఉద్యమాలతోనే సమాజానికి శాస్త్రీయమైన, సమాన విద్యావ్యవస్థ అందుబాటులోకి వస్తుందని టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎ.నర్సింహారెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ అధ్యక్షతన విద్యాసదస్సుతో పాటు టీపీటీఎఫ్ సీనియర్ నాయకులు గోవిందరెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ప్రజలకు అనుకూలమైన విద్యా విధానాన్ని ప్రభుత్వాలు రూపొందించలేకపోయాయని విమర్శించారు. సమాన విద్యకు రాజ్యాంగం హామీ ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలయమయ్యారన్నారు. టీపీటీఎఫ్ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్‌కుమార్ మాట్లాడుతూ సంఘటిత ఉద్యమాలు నిర్వహిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాములు, కొండల్‌రెడ్డి, వై.అశోక్‌కుమార్, తిరుపతి, రవీందర్, జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి రాంచందర్, ప్రకాశ్‌రావు, లక్ష్మయ్యయాదవ్, సంజీవయ్య, నాసర్‌పటేల్ తితరులు పాల్గొన్నారు.



65వ జాతీయరహదారికి అనుకుని అర్బన్ పార్కును నిర్మించిన అటవీ స్థలం, జహీరాబాద్ సమీపంలోని అర్బన్ పార్క్ గేట్

ఆగుతూ.. సాగుతూ..

● నిధుల కొరతతో నిలిచిన జహీరాబాద్ అర్బన్‌పార్కు పనులు
● ఐదేళ్ల క్రితం ప్రారంభమై ఇప్పటికీ నత్తనడకనే..
● నిధులు మంజూరైతేనే పనులు ముందుకు సాగే అవకాశం

జహీరాబాద్, సెప్టెంబరు 14, (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణం సమీపంలో ఐదేళ్ల క్రితం ప్రారంభించిన అర్బన్ పార్కు అభివృద్ధి పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి. ఇదిగో, అదిగో అంటూ అధికారులు ఊరిస్తున్నప్పటికీ పనులకు మోక్షం లభించడం లేదు. జహీరాబాద్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు, జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి ఆహ్లాదాన్ని పంచాలనే లక్ష్యంతో ఈ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అయితే, పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజల ఆశలు అడియాశలయ్యాయి.

రూ.4 కోట్లు మంజూరు

2019లో జహీరాబాద్ సమీపంలోని ముఖీం బాగ్ వద్ద ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌లో అర్బన్ పార్కు కోసం రూ.4 కోట్లు మంజూరు చేశారు. దీని కోసం 200 ఎకరాల భూమిని కేటాయించారు. పార్కులో అభివృద్ధి పనుల కోసం ముందుగా రూ.2 కోట్లు కేటాయించారు. వాటితో పార్కు చుట్టూ మూడు కిలోమీటర్ల కంచె, ఒకటిన్నర కిలోమీటరు వాకింగ్ ట్రాక్, వాచ్ టవర్, వాచ్‌మెన్ గది, కమాన్ నిర్మాణం వంటి పనులు చేపట్టారు.

అదనపు నిధులు అవసరం

పార్కు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావాలంటే ఇంకా చాలా పనులు చేయాల్సి ఉంది. మంచి నీటి బోర్లు, బెంచీలు, మరుగుదొడ్లు, నీటి కుళాయిల బిగింపు వంటివి చేపట్టాల్సి ఉంది. ఇందుకు సుమారు రూ.1.50 కోట్లు అవసరం. ఈ నిధులు మంజూరైతేనే పనులు ముందుకు సాగే అవకాశం ఉంది.

ఉన్నతాధికారులకు విన్నవించాం

అర్బన్ పార్కులో మిగిలిన పనులు పూర్తి చేయడానికి నిధులు అవసరం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించాం. వినియోగంలోకి రావాలంటే సెక్యూరిటీగది, టాయిలెట్స్, అంతర్గతంగ మట్టిరోడ్లు తదితరాలను చేపట్టాల్సి ఉందినిధుల మంజూరు కోసం ఇటీవల ప్రతిపాదనలు పంపించాం. త్వరలో నిధులు వస్తాయని భావిస్తున్నాం. పార్కు వినియోగంలోకి వస్తే ప్రజలకు మంచి వాతావరణం లభిస్తుంది.

-దేవీలాల్, ఫారెస్ట్ రేంజ్ ఇన్‌చార్జి అధికారి

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

● అప్పుల బాధ భరించలేక నిజాంపేటలో వివాహిత.. చిన్నకంజర్లలో మెకానిక్
● మద్యానికి బానిసై నందిగామలో యువకుడు

నిజాంపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుటుంబ అవసరాలకు దొరికిన చోటల్లా అప్పు చేసిన వివాహిత తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజాంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటకు చెందిన బండారి చిన్నక్క(37) భర్త యాదగిరితో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నది. వచ్చే కొద్దిపాటి డబ్బుతో కుటుంబం గడవక మహిళా గ్రూపుల్లో, పరిచయస్తుల వద్ద రూ.2 లక్షల దాకా అప్పు చేసింది. అయితే నెలవారి కిస్తీలు కట్టడం ఆమెకు పెనుభారమైంది. దీంతో డబ్బులు చెల్లించే మార్గం కనిపించక మానసికంగా కుమిలిన చిన్నక్క తన ఇంట్లోనే దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి 15 ఏళ్ల కూతురు, 10 సంవత్సరాల కొడుకు ఉన్నారు. అత్త కిష్టవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యాసిడ్ తాగి...

పటాన్‌చెరు సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ భరించలేక యాసిడ్ తాగి ఓ మెకానిక్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల గ్రామంలో నివాసం ఉంటున్న సయ్యద్‌అమీర్ మూడేళ్ల క్రితం రేష్మాబేగంను వివాహం చేసుకున్నారు. వీరికి 10 నెలల కుమారుడు ఉన్నారు. చైతన్యనగర్‌లో మోటారు మెకానిక్ షాపు పెట్టుకున్నారు. అలానే రుణం ప్రాతిపదికన ఆటో కొనుగోలు చేసారు. వ్యాపారం ఆశించినస్థాయిలో నడవడం లేదు. రుణానికి సంబంధించిన వాయిదాలు చెల్లించడం లేదు. 12వ తేదీ సాయంత్రం సమయంలో అప్పులు బాధ కలిగిస్తున్నాయంటూ యాసిడ్ తాగానని భార్య రేష్మాబేగంకు ఫోన్ చేసి చెప్పారు. తొందరగా ఇంటికి రా ఆసుపత్రికి తీసుకువెళతానంటూ చెప్పడంతో వెళ్లారు. సంగారెడ్డి ఆసుపత్రిలో ప్రాథమికంగా చికిత్సలు చేశారు. అక్కడి నుంచి ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. భార్య రేష్మాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఉరేసుకుని..

పటాన్‌చెరు సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం నందిగామలో నివాసం ఉంటున్న మేకల లక్ష్మణ్(39) గొర్రెలు పెంచుకుంటున్నాడు. మద్యం అలవాటు మానుకోవాలంటూ గ్రామస్థులు పలుమార్లు హెచ్చరించారు. అయినా మార్పు రాకపోవడంతో భార్య నిహారిక మూడు నెలల క్రితం తెల్లాపూర్‌లోని తల్లిగారింటికి పిల్లలతో సహా వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో లక్ష్మణ్ ఇంట్లోనే మద్యం సేవించి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నిహారిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నీళ్లనుకుని యాసిడ్ తాగి.. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించిన తరువాత తాగునీరు అనుకొని యాసిడ్ తాగి మృత్యువాత పడిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విజయకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లాపూర్ పురపాలక పరిధి కర్దనూరు గ్రామానికి చెందిన బ్యాగరి దేవయ్య(50) ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నారు. మద్యం అలవాటు ఎక్కువగా ఉంది. గత నెల 24న సాయంత్రం మద్యం సేవించిన తరువాత తాగునీరు అనుకొని యాసిడ్‌ను తాగారు. ఆసుపత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. దేవయ్య భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మంత్రి పొన్నం కాన్వాయ్‌లోని కారుకు ప్రమాదం

కుకునూరుపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లోని కారు ప్రమాదానికి గురైంది. ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ హుజురాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా కుకునూరుపల్లి గ్రామ శివారులోని హోండా షోరూం వద్ద కాన్వాయ్‌లోని ఓ కారు టైరు పంచర్ కావడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి దానిపైకి వెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు ప్రమాదం తప్పింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి గురైన కారు

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు

శివ్వంపేట, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్వహిస్తున్న మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు ఆదేశాల మేరకు పోలీసులు అడ్డుకున్న ఘటన మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకున్నది. మండలంలోని పిలుట్ల గ్రామంలో నిబంధన విరుద్ధంగా రెండు రోజులుగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ పౌల్ట్రీ ఫార్మ్ నిర్మాణానికి తరలిస్తుండడంతో గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కమలాద్రి ఆదేశాల మేరకు పిల్లుట్లలో మట్టి తవ్వకాలను పోలీసులు అడ్డుకుని ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించారు.

హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం

వసతి గృహ సంక్షేమాధికారి నాగేశ్వర్‌రావు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నట్టు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ వసతి గృహ సంక్షేమాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. సంగారెడ్డిలోని హాస్టల్‌గడ్డ ఎస్సీ బాలుర వసతిగృహంలో ఆదివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం, గుడ్డు, పండ్లు, పౌష్టికాహారం అందిస్తున్నట్టు వివరించారు. ఆరోగ్యం, పరిశుభ్రత కోసం అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందించే సౌకర్యాలు, భోజనంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

ఓవర్‌టేక్ చేయబోయి రోడ్డు ప్రమాదం

లారీ డ్రైవర్, క్లీనర్లకు తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన లారీ

రామాయంపేట, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : ముందు ఉన్న లారీని ఓవర్‌టేక్ చేయబోయిన లారీ, దానినే ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రామాయంపేట, జప్తిశివనూర్ హైవేపై ఆదివారం వేకువజామున ఈ ప్రమాదం జరిగింది. లారీ డ్రైవర్ కాలు విరగగా, క్లీనర్‌కు తీవ్రగా గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. దీంతో కామారెడ్డి దారిలో గంటపాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది చేరుకొని లోడ్ లారీని అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

వ్యాన్ బోల్తా పలువురికి తీవ్ర గాయాలు

చేగుంట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మెదక్ చర్చికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు వ్యాన్ బోల్తా పడిన ఘటనలో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన చేగుంట శివారులోని పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ -2 బిక్యానాయక్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని బేగంపేట కు చెందిన కుటుంబంలోని 15 మంది జీహెచ్ఎంసీకి సంబంధించిన వ్యాన్‌లో మెదక్ చర్చికి వెళ్లి, తిరిగి వస్తుండగా చేగుంట శివారులో ప్రమాదం చోటుచేసుకుంది. అనిత, లచ్చవ్వ ఇద్దరికీ తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. సునీత, దీపికకు స్వల్ప గాయాలయ్యాయి ఈ మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

నారాయణఖేడ్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అధికారులు ఎన్నిసార్లు హెచ్చరికలు చేస్తున్నా రైతులు మాత్రం రోడ్లపై పంటలను నూర్పిడి చేస్తూనే ఉన్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదాలు పొంచి ఉన్నాయో తెలియడం లేదంటూ వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఆరబోస్తే నూర్పిడి జరుగుతుందని, అంతేకాకుండా పంట తొందరగా ఆరిపోతుందని, రోడ్ల పంటను ఉంచుతున్నారు. రైతులు అవసరం కోసం ధాన్యం మధ్యలో రాళ్లను ఉంచినప్పటికీ పంట నూర్పిడి అనంతరం రాళ్లను తీయకుండా వెళ్లిపోతుండడంతో కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్లపై పంటలను నూర్పిడి చేయకుండా, ఆరబెట్టకుండా అవగాహన కార్యక్రమాలను గ్రామాల వారీగా నిర్వహిస్తే మార్పు వస్తుందని వాహనదారులు అంటున్నారు.


ఖేడ్ పరిధిలోని సంజీవన్‌రావుపేట రోడ్డు మార్గంలో పంట నూర్పిడి

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌లో మెదక్ క్రీడాకారులకు ప్రథమస్థానం



మొదటి స్థానంలో నిలిచిన బాలికల జట్టు

మిరుదొడ్డి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా జఫర్గఢ్ మండలం కూనూర్‌లో జరిగిన 44వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారులు మొదటి బహుమతిని సాధించారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిని సాధించడం పట్ల బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భైరయ్య, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపాలి

- మెదక్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాషనాయక్
- షూటింగ్ బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక



తూప్రాన్ గురుకులంలో ఎంపికైన బాలుర జట్టు

తూప్రాన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి రాణించాలని మెదక్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాషనాయక్, ఉపాధ్యక్షుడు నరేష్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం తూప్రాన్ తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-18 బాలుర, బాలికల విభాగంలో పోటీలు నిర్వహించి, రాష్ట్రస్థాయికి జిల్లా జట్ల ఎంపిక చేపట్టారు. జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, క్రీడల్లో నైపుణ్యం కనబర్చిన 24 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈనెల 22 నుంచి 24 వరకు మూడు రోజులు మహబూబాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని వివరించారు. క్రీడా పోటీలను ప్రధాన కార్యదర్శి బానోత్‌నవీన్, రెఫ్రి మహేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు శోభరాణి, రాంచంద్రం, జోసెఫ్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, పీడీ, పీఈటీలు లతీఫా, రజిత, శేఖర్, రమేష్, మహేశ్ పాల్గొన్నారు.



తూప్రాన్ గురుకులంలో ఎంపికైన బాలికల జట్టు

20 ఏళ్లు గడిచినా ఆర్‌టీఐ పట్ల అవగాహన కరువు

ప్రెస్‌క్లబ్‌లో సమాచారహక్కు చట్టం సాధన కమిటీ సమావేశం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లు గడుస్తున్నా ఆర్‌టీఐ పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేదని సమాచారహక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్ అన్నారు. సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య సంస్థలలో ప్రభుత్వ కార్యాలయాలలో ఆర్‌టీఐ ద్వారా సమాచారాన్ని సేకరించాలన్నారు. దీంతో గుడ్ గవర్నెన్స్ సాధ్యమవుతుందన్నారు. ఆర్‌టీఐ సంబంధిత సాంకేతిక మద్దతు కోసం తమను సంప్రదించాలన్నారు. 'ఆర్‌టీఐ లగావ్.. బ్రష్టాచర్ హఠావ్' నినాదంతో ముందుకెళ్లాలి అని అన్నారు. సమావేశంలో జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు చంటిముదిరాజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశంగౌడ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బొడ్డెమ్మ వైభవం

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచే పండుగలు బొడ్డెమ్మ, బతుకమ్మ. భాద్రపద మాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే పంచమి నుంచి చతుర్దశి వరకు తొమ్మిది రోజుల పాటు బొడ్డెమ్మ పండుగను జరుపుకుంటారు. ముఖ్యంగా బాలికలు, యువతులు ఎంతో ఉత్సాహంగా ఇందులో పాల్గొంటారు. ఇది ప్రకృతిని ఆరాధించే పండుగ. మట్టి, పూలతో బొడ్డెమ్మను తయారు చేసి పూజిస్తారు. నృత్యం, సాహిత్యం, గానం అనే మూడు కళల మేళవింపుతో ఆ జగదీశ్వరీమాతను ఆరాధించడమే బొడ్డెమ్మ వేడుకగా పండితులు చెబుతున్నారు.



- సంస్కృతీ సంప్రదాయాల పండుగ
- తొమ్మిది రోజుల పాటు సందడి
- బొడ్డెమ్మతో బతుకమ్మ సంబరాలు ప్రారంభం



కొండపాక, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పుట్ట మట్టి, ఎర్ర మట్టితో బొడ్డెమ్మను తీర్చిదిద్ది, రుద్రాక్ష పూలతో అలంకరిస్తారు. ప్రతిరోజు పాటలు పాడుతూ, బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ ఆడిపాడతారు. ఈ పండుగ ముగిసిన తర్వాత, బతుకమ్మ ప్రారంభమయ్యే ముందు బొడ్డెమ్మను స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తారు.

మారుతున్న రూపాలు

గతంలో తొమ్మిది రోజులపాటు జరుపుకునే ఈ పండుగను ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో మూడు లేదా ఐదు రోజులు మాత్రమే చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో బతుకమ్మ ప్రారంభానికి ముందు ఒర రోజే ఆడి నిమజ్జనం చేస్తున్నారు. పీట బొడ్డెమ్మ, గుంట బొడ్డెమ్మ, పందిరి బొడ్డెమ్మ, బాయి బొడ్డెమ్మ, అంతరాల బొడ్డెమ్మ వంటి పేర్లతో వివిధ రూపాల్లో వీటిని తయారు చేస్తారు. గతంలో మట్టితో తయారు చేసే బొడ్డెమ్మలను, ఇప్పుడు కాలంతోపాటు మారుతూ కట్టెలతో చేసిన బొడ్డెమ్మలను కూడా కొనుగోలు చేసి ఆడుతున్నారు. బొడ్డెమ్మ వేడుకలు పూర్తయిన మరుసటి రోజు అంటే మహాలయ అమావాస్య రోజున బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయి.



అమ్మడానికి సిద్ధంగా ఉన్న కలపతో చేసిన బొడ్డెమ్మలు

నిండు నూరేళ్లు చల్లగా..



ఇమామ్‌బాద్‌లో నిమ్మల రాములు వందేళ్ల జన్మదిన వేడుకల్లో కుటుంబసభ్యులు

సిద్దిపేట సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆశీర్వదించే సమయంలో నిండు నూరేళ్లు పిల్లాపాపాలతో చల్లగా ఉండాలంటూ దీవిస్తుంటారు. అయితే, ప్రస్తుత కాలంలో వంద సంవత్సరాలు జీవించటం అరుదుగానే జరుగుతుంది. సిద్దిపేట పట్టణంలోని 15వ వార్డు ఇమామ్‌బాద్‌లో నిమ్మల రాములు వంద సంవత్సరాల జన్మదిన వేడుకలను ఆయన కుటుంబసభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాగా, రాములుకు ఏడుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు, వీరి భార్యాపిల్లలు మొత్తంగా 68 మంది కుటుంబసభ్యులు ఉన్నారు. రాములు వందేళ్ల పుట్టినరోజు వేడుకలను ఆదివారం మనువలు, మునిమనువల మధ్య ఆనందంగా జరుపుకున్నారు. వందేళ్ల జీవితానికి సార్థకత చేకూరిందని, నాలుగు తరాలను చూడటం సంతోషంగా ఉందంటూ రాములు పంచుకున్నారు.

సైబర్ క్రైం కేసులో బాధితులకు రూ.కోటి అప్పగింత

- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 266 సైబర్ క్రైం కేసులు పరిష్కరించి రూ.1.05కోట్లు బాధితులకు అప్పగించినట్లు సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి నిబద్ధతతో విధులు నిర్వహించి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన రాజీపడటానికి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో ఐపీసీ కేసులు 540, ఇపెటీ కేసులు 318, డీడీ కేసులు 840 మొత్తం 1,698 కేసులలో కక్షిదారులను రాజీ కుదుర్చినట్లు ఆయన చెప్పారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్ అదాలత్ అనేది ఒక సువర్ణావకాశమని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందుల పాలుచేసుకోకూడదని ఆయన సూచించారు. రాజీ మార్గమే రాజమార్గమని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న కేసులన్నీ ఇరువర్గాలు రాజీ పడవచ్చని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి కృషి చేసిన పోలీసు అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, రవి, రమేష్, సత్యనారాయణ తదితరులను ఎస్పీ అభినందించారు.

డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ (సీబీసీఎస్)లో, అలాగే పీజీ(సెమిస్టర్) ప్రథమ, ద్వితీయ సంవత్సర కోర్సుల్లో ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అడ్మిషన్ పొందుటకు గడువు పొడిగించారు. ఈ నెల 26 వరకు పెంచారని సిద్దిపేట స్టడి సెంటర్ రీజనల్ కో ఆర్డినేటర్ డా. శ్రద్ధానందం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం అభ్యర్థులు టీఎస్ ఆన్‌లైన్, మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాల్లో యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, రిజిస్ట్రేషన్ ఫారం తో పాటు సంబంధించిన ఒరిజినల్స్, జిరాక్స్ సర్టిఫికెట్స్‌తో అభ్యాసకుల సహాయ కేంద్రంలో వెరిఫికేషన్ చేయించుకోవాలని, ఆ తరువాత ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.



యూరియా వేయకపోవడంతో దౌల్తాబాద్‌లో ఎర్రబారుతున్న వరి చేను, అప్పాయిపల్లిలో ఎర్రబారిన మొక్కజొన్న

దిగుబడి దిగులు

సకాలంలో ఎరువు అందక ఎర్రబారుతున్న పంటలు

దౌల్తాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మొదట వర్షాలు లేక దిగులుపడిన రైతులను ఇప్పుడు యూరియా కొరత వేధిస్తోంది. జూన్, జూలైలో వర్షాలు లేకపోవడంతో ఆలస్యంగా పంటలు సాగు చేసిన రైతులు, ఇప్పుడు వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నా.. యూరియా అందక ఆందోళన చెందుతున్నారు. సకాలంలో ఎరువు అందకపోవడంతో పంటల ఎదుగుదల లోపించి దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు.

సరిపడా అందడం లేదు

క్షేత్రస్థాయిలో రైతులకు సరిపడా యూరియా లభించడం లేదు. ఎకరానికి ఒకటి లేదా రెండు బస్తాలు మాత్రమే వేయాలని అధికారులు సూచిస్తుండగా, నానో యూరియా పిచికారీ చేయాలని చెబుతున్నారు. అయితే, నానో యూరియా పిచికారీ చేస్తే మొక్కలు పచ్చబడతాయే తప్ప, వాటి ఎదుగుదలలో మార్పు ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో యూరియా కోసం సొసైటీల ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటుగా కూడా యూరియా దొరకడం లేదని రైతులు చెబుతున్నారు.

అంచనాకు మించి..

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో అధికారులు అంచనా వేసిన దానికంటే చాలా ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 20 వేల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా, అనధికారికంగా సుమారు 30 వేల ఎకరాలకు వరకు సాగులో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఇలా జిల్లా అంతటా అదనపు విస్తీర్ణానికి యూరియా లెక్కలు లేకపోవడంతో రైతులకు సమస్యలు మరింత జటిలమవుతున్నాయి.

పంటలపై ప్రతికూల ప్రభావం

దాదాపు మూడు నెలల వయస్సున్న మొక్కజొన్న చేలు సరైన ఎదుగుదల లేకుండానే తలెత్తే దశకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల కంకిలో నాణ్యత కూడా లోపిస్తోంది. వరి పొలాలు ఎర్రబడుతున్నాయి. ఇక పూత దశకు చేరాల్సిన పత్తి మొక్కలు అడుగు మేరకే పెరిగాయి. పూత, కాత సరిగ్గా రావడం లేదు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఈసారి ఆశించినంత దిగుబడి రావడం కష్టమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరి చేను ఎర్రబారుతోంది



నేను 12 ఎకరాల్లో వరి పంట వేశాను. యూరియా అందుబాటులో లేక వేయకపోవడంతో చేను ఎర్రబారుతున్నది. మొక్కజొన్న ఎదుగుదల లేదు. కంకి గింజలు సరిగ్గా రావడం లేదు. ఎరువు లేకపోవడంతో బలం లేక కంకులు సరిగ్గా రావడం లేదు. పత్తి పరిస్థితి కూడా అంతే ఉంది.

- నారెడ్డి సాయిరెడ్డి, దీపాయంపల్లి, దౌల్తాబాద్ మండలం

నానో యూరియా స్ప్రే చేశా



నేను 8 ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎన్నిసార్లు వెళ్లినా యూరియా దొరకలేదు. దీంతో నానో యూరియా పిచికారీ చేసినా ఎదుగుదల లేదు. లక్షల పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే మాకు నిరాశ మిగిలింది. యూరియా సరిపడా ఇస్తేనే పంటలు దిగుబడులు వస్తాయి.

- గొల్లపల్లి బాలమల్లు, గాజులపల్లి, దౌల్తాబాద్ మండలం


'నానో'పై నమ్మకమేదీ?

- నాలుగేళ్ల క్రితమే మార్కెట్లోకి వచ్చిన ద్రవరూప యూరియా
- ప్రచారం కరువు.. బస్తాలకే రైతుల మొగ్గు



రామాయంపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నాలుగు సంవత్సరాల క్రితమే మార్కెట్‌లోకి వచ్చిన నానో లిక్విడ్ యూరియాపై అన్నదాతలకు నమ్మకం కుదరడం లేదు. క్షేత్రస్థాయిలో సరైన అవగాహన లేకపోవడంతో రైతులు దీని వాడకానికి ఆసక్తి చూపడం లేదు. గతంలో యూరియా బస్తాల కొరత లేకపోవడంతో విస్తృత ప్రచారం చేయడంలో వ్యవసాయశాఖ విఫలమైంది. ఈ ఏడాది బస్తాల కొరత ఎక్కువగా ఉండటంతో ఇప్పుడు అధికారులు నచ్చజెప్పినా రైతులు నమ్మలేకపోతున్నారు. నానో యూరియా వాడకంతో భూమికి ఎలాంటి నష్టం వాటిల్లదని చెబుతున్నా, రైతులు మాత్రం బస్తాల రూపంలో లభించే యూరియాకే మొగ్గు చూపుతున్నారు. మెదక్ జిల్లాలో 3,39,809 ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా, కేవలం 16 వేలకుపైగా ఎకరాల్లో మాత్రమే ద్రవరూప నానో యూరియాను పిచికారీ చేస్తున్నారు. ఇది ఐదు శాతానికి కూడా తక్కువగా ఉంది. వచ్చే సీజన్ నాటికైనా రైతాంగంలో ద్రవరూప నానోపై నమ్మకం కలిగేలా ప్రచారం చేయాల్సిన అవసరముంది.

క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నాం



అర లీటర్ ప్లాస్టిక్ డబ్బాలో దొరికే నానో లిక్విడ్, బస్తాల్లో లభించే యూరియా కన్నా బాగా పనిచేస్తుంది. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలోనూ ప్రచారం చేస్తున్నాం. కానీ రైతాంగం మొదటి నుంచి అలవాటైన యూరియానే ఎంచుకుంటున్నారు.

- దేవ్‌కుమార్, మెదక్ జిల్లా వ్యవసాయాధికారి



కల్వకుంట పీఏసీఎస్ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

అదే వరుస.. అదే గోస

నిజాంపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు గోస తప్పడం లేదు. మండల పరిధిలోని కల్వకుంటలో 440 బస్తాలు యూరియా రాగా, శనివారం రాత్రి నుంచే రైతులు పీఏసీఎస్ కేంద్రం వద్దకు చేరుకుంటూ వచ్చారు. ఒక్కసారిగా రైతుల సంఖ్య పెరిగిపోవడంతో ఆదివారం పోలీస్ బందోబస్తు మధ్య యూరియాను పంపిణీ చేశారు.

రేషన్‌కార్డు వచ్చినా ఏం లాభం?

- ఆగస్టు 15 తర్వాత కార్డు మంజూరైన వారికి ఇబ్బందులు
- ఒక నెల బియ్యం నష్టపోతున్న లబ్ధిదారులు
- వచ్చే నెల నుంచి సరఫరా



ఖానాపూర్‌లో కొత్త రేషన్‌కార్డు పొందిన లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం

కోహీర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసినప్పటికీ, వాటిని పొందిన లబ్ధిదారులు బియ్యం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఆగస్టు 15వ తేదీలోపు రేషన్‌కార్డులు మంజూరైన వారికి సెప్టెంబరు నెల బియ్యం అందాయి. అయితే, ఆతర్వాత కార్డులు మంజూరైన వారికి మాత్రం సెప్టెంబరు నెల బియ్యం మంజూరు కాలేదు. దీంతో లబ్ధిదారులు బియ్యం అందక నిరాశతో వెనుతిరుగుతున్నారు.

అందని సెప్టెంబరు కోటా

ఆగస్టు 15వ తేదీ తర్వాత కార్డులు మంజూరైన వారు ఒక నెలకు సంబంధించిన బియ్యాన్ని నష్టపోతున్నామని వాపోతున్నారు. గతంలో మూడు నెలల బియ్యం ఒకేసారి ఇచ్చినట్లుగా, ఇప్పుడు సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన బియ్యం కలిపి ఇవ్వాలని లబ్ధిదారులు అధికారులను కోరుతున్నారు.

అక్టోబరులో అందరికీ బియ్యం

సెప్టెంబరు నెలలో బియ్యం మంజూరు కానీ లబ్ధిదారులందరికీ అక్టోబరు నెలలో బియ్యం అందిస్తాం. ఆగస్టు 15 వరకు కొత్త రేషన్ కార్డులు అప్‌డేట్ అయిన వారికి మాత్రమే సెప్టెంబరులో బియ్యం ఇచ్చాం. ఆ తర్వాత మంజూరైన వారికి కోటా మంజూరు కాలేదు. అక్టోబరులో కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ బియ్యం అందుతాయి.

- వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్

నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- నేటికీ అసంపూర్తిగా మోడల్ హౌజ్
- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఆధార్‌లో పొరపాట్లతో కార్యాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- బిల్లులు రాక అవస్థలు
- ప్రశ్నార్థకంగా 105 ఇళ్ల నిర్మాణ పనులు

ములుగు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ములుగు మండలంలో నత్తనడకన సాగుతున్నది. నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన గృహనిర్మాణశాఖ అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడంలేదు. కాగా ఇందిరమ్మ లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు తొలుత ప్రతీ మండలకేంద్రంలో ఓ మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే ములుగు మండలకేంద్రంలో చేపట్టిన మోడల్ ఇంటి నిర్మాణం నేటికీ అసంపూర్తిగా దర్శనమివ్వడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

కరువైన పర్యవేక్షణ

ములుగు మండలానికి 333 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మంజూరైనవాటిలో 228ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ చేశారు. మిగతా ఇళ్ల విషయాన్ని అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా అడుగులు వేయడంలేదు. ఫలితంగా 105 ఇళ్ల నిర్మాణాల ప్రశ్నార్థకంగా తయారయ్యాయి. మార్కింగ్ చేసిన ఇందిరమ్మ ఇండ్లలో కేవలం 71 ఇందిరమ్మ ఇళ్లు ప్లింత్ బీమ్ స్థాయి నిర్మాణం జరిగాయి. ఫొటో క్యాప్చర్ చేసి బిల్లులు అందజేసేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే లబ్ధిదారులను సంబంధిత అధికారులు పట్టించుకోవంలేదనే ఆరోపణలు ఉన్నాయి.




ములుగులో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ నమూనా భవనం, బేస్మెంట్ నిర్మాణమైన బిల్లు రాకపోవడంతో నిలిచిన ఓ లబ్ధిదారుడి ఇల్లు

ఆధార్ నమోదులో తప్పులతో ఇక్కట్లు

మొదట్లో సరైన అవగాహన లేకపోవడం వల్లో లేదా అధికారుల తొందరపాటు వల్లో కొందరు లబ్ధిదారుల ఆధార్‌కార్డు నంబర్లు తప్పుగా నమోదయ్యాయి. ప్రస్తుతం ఆ పొరపాట్లే లబ్ధిదారులపాలిట శాపంగా మారాయి. అధికారులు ఆ పొరపాట్లను సరి చేసేందుకు కనీసం ప్రయత్నాలు కూడా చేయడంలేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన పలువురు లబ్ధిదారులు ఆధార్ తప్పులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బేస్మెంట్ వరకు నిర్మాణాలు చేపట్టిన కొందరు లబ్ధిదారులకు అధార్ నంబర్ నమోదులో పొరపాట్ల వల్ల బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు. వాటిని సరి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరించడంతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సివస్తున్నది.

వర్షాలతో నిర్మాణ సామగ్రికి నష్టం

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న సిమెంట్, ఇటుకలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్నట్లు బాధితులు వాపోతున్నారు. అధికారులు సకాలంలో స్పందించి ఉంటే నష్టం జరిగేది కాదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని లబ్ధిదారుల ఆధార్ నంబర్ల నమోదులో తప్పులు లేదా ఇతర సాంకేతిక పొరపాట్లను సరిచేస్తూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆధార్ నంబర్‌ను సరిచేయండి

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన అధికారులు ఆధార్ నంబరు తప్పుగా నమోదు చేశారు. బేస్మెట్ నిర్మాణం చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికి బిల్లు అందడంలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్న సరి చేయడంలేదు. వెంటనే అధికారులు సరి చేసి ఇందిరమ్మ ఇంటి బిల్లు ఇప్పించాలి.

- దండె లక్ష్మి, ములుగు, ఇందిరమ్మ లబ్ధిదారు

మేనేజ్‌మెంట్ పర్యవేక్షణ లోపంతోనే ప్రమాదం



ఆర్చ్ ఫార్మా ప్రమాద విషయాలు తెలుసుకుంటున్న రవీందర్ రెడ్డి

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి ఆర్చ్ ఫార్మా కెమికల్ ఫ్యాక్టరీలో మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదం యాజమాన్య పర్యవేక్షణ లోపమే అని బీఆర్‌టీయూ ఆర్చ్ ఫార్మా యూనియన్ గౌరవ అధ్యక్షుడు మా రెడ్డి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆర్చి ఫార్మాను సందర్శించి ప్రమాద విషయాలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాద విషయం మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. వచ్చే పండుగ తర్వాత ఎమ్మెల్యే మాజీమంత్రి హరీశ్‌రావు ను ఫ్యాక్టరీకి తీసుకువచ్చి కార్మికుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వెరిటాస్ సైనిక్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

ములుగు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వెరిటాస్ సైనిక్‌స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి పరిధిలో ఉన్న పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెరిటాస్ సైనిక్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే గురువే అఘాయిత్యానికి పాల్పడడం ఉపాధ్యాయ వృత్తికే అవమానమన్నారు. ఉపాధ్యాయ వృత్తికే మచ్చ తెచ్చే వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇంత జరుగుతున్నా, మండల విద్యాధికారి కానీ, జిల్లా విద్యాధికారి కానీ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. సత్వరమే వెరిటాస్ సైనిక్ స్కూల్ గుర్తింపు రద్దు చేసి, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడతామన్నారు.

న్యూస్ బాక్స్

గణేశ్‌గడ్డ వరకు ఆధ్యాత్మిక పాదయాత్ర

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి యోగా సొసైటీ ఆధ్వర్యంలో గణేశ్‌గడ్డలోని గణేశ్ టెంపుల్ వరకు ఆధ్యాత్మిక పాదయాత్రను ఆదివారం నిర్వహించారు. యోగాపై విస్తృత ప్రచారంతో పాటు, అందరికీ ఆరోగ్యం, స్నేహ భావం, పరస్పర సహకారం, ప్రతీ వ్యక్తికి దైవచింతన, మనోవికాసం కలగాలన్నదే పాదయాత్ర ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి యోగా అసోసియేట్ అధ్యక్షుడు దినేశ్, ప్రధాన కార్యదర్శి సోమలింగం, పతాంజలి జిల్లా అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, మల్లారెడ్డి, రాజన్న, భక్తులు సుగుణాకర్, నాగరాజు పాల్గొన్నారు.

జాతీయభావాన్ని పెంపొందించుకోవాలి: ఏబీవీపీ

జహీరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర ఇన్‌చార్జి బాపురావు, ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు విష్ణు, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రచార కార్యదర్శి బోడ లక్ష్మణ్ పేర్కొన్నారు. రెండు రోజులుగా జహీరాబాద్ పట్టణంలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన సమారోప్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులందరూ దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ, తపస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

హాస్టల్ పనుల్లో వేగం పెంచండి

మునిపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కూలిపోయిన లింగంపల్లి గురుకుల హాస్టల్ భవనం పనుల్లో వేగం పెంచి, నూతన భవన నిర్మాణ చేపట్టి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్ అధికారులను కోరారు. ఆదివారం లింగంపల్లి గురుకుల హాస్టల్ భవన కూల్చివేత పనులను సీపీఎం నాయకులతో కలిసి ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టల్ భవనాన్ని త్వరగా కూల్చివేసి అందులో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులను చేపట్టాలన్నారు. అలాగే ఈ నెల 17న సంగారెడ్డిలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులకు పిలుపునిచ్చారు.

సొసైటీ సబ్ సెంటర్ తెరవాలి

నిజాంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొన్నాళ్ల క్రితం పలు కారణాలతో నిలిపివేసిన సొసైటీ సబ్ సెంటర్‌ను తెరవాలని వెంకటాపూర్ ప్రాంత రైతులు తీర్మానించారు. ఈ మేరకు మండల పరిధిలోని వెంకటాపూర్ (కే) గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం గ్రామస్థులు, రైతులు సమావేశమై యూరియా కష్టాలపై చర్చించారు. ఇదివరకు గ్రామంలో సబ్ సెంటర్ ఉండటంవల్ల ఇక్కడే ఎరువుల సరఫరా జరిగేదన్నారు. అందువల్ల ఇకపై గ్రామంలోనే సబ్ సెంటర్‌ను పునరుద్ధరించాలని సంబంధిత జిల్లా అధికారులకు, కల్వకుంట సొసైటీకి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అందే కొండల్ రెడ్డి, డైరెక్టర్లు మధుసూదన్ రెడ్డి, కాస రాజేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మెదక్ ఎంపీని కలిసిన నాయకులు

మాసాయిపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలపై మండల బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆదివారం మాసాయిపేట మండల బీజేపీ అధ్యక్షుడు మొలుగు నరేందర్‌రెడ్డి, మాసాయిపేట మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రధాన రైల్వే అండర్ బ్రిడ్జి నీటి సమస్య, చెట్ల తిమ్మాయిపల్లి చౌరస్తా వద్ద జంక్షన్ నిర్మాణం, సర్వీసు రోడ్డు పునరుద్ధరణ, ఫ్లై ఓవర్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం తదితర పనులు చేపట్టాలని కోరారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీతో కలుషిత నీరు సరఫరా



గాజులపల్లి- జంగాపల్లి రోడ్డులో భగీరథ మెయిన్ లైన్ లీకేజీ , (ఇన్‌సెట్‌లో) లీకేజీ నీటిలో కలుస్తున్న కలుషితాలు

దౌల్తాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ లీకేజీ కారణంగా వ్యర్థ పదార్థాలతో నీరు కలుషితమవుతున్నది. దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి గ్రామ శివారులోని జంగాపల్లి రోడ్డులో మిషన్ భగీరథ తాగునీరు పైప్ లైన్‌కు చిన్న రంధ్రం పడి రోడ్డుపై చిన్నపాటి వరదల ప్రవహిస్తుంది. దీంతో ప్రజలు తాగే స్వచ్ఛమైన తాగే నీటిలో కలుషితమైన వ్యర్థ పదార్థాలు కలిసి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం నెలకొన్నది. సంబంధిత ఏ ఒక్క అధికారి కూడా అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని చుట్టుపక్క గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కలుషిత నీటిని తాగి ప్రజలు అస్వస్థతకు గురికాక ముందే జిల్లా, అధికారులు పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాలు కోరుతున్నారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదు: బీజేపీ

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదని బీజేపీ గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి మాడుగురి నరసింహ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ నెల 12న గజ్వేల్ పట్టణం అయ్యప్ప ఆలయం ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జీఎస్టీ అవగాహన సదస్సులో గజ్వేల్ పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు కాశమైన నవీన్ సమావేశ హాల్ దగ్గరికి వచ్చి అలజడి సృష్టించి, దుర్భాషలాడుతూ పార్టీ క్రమశిక్షణ చర్యలకు వ్యతిరేకంగా పాల్పడడంతో పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం షోకాజ్ నోటీస్ ఇచ్చినట్టు నరసింహ ముదిరాజ్ తెలిపారు. మూడు రోజుల్లో నోటీస్‌కు వివరణ ఇవ్వాలని, వివరణ బట్టి తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

వజ్రమ్మ దశదిన కర్మకు హాజరైన మాజీ మంత్రులు



వంటేరు వజ్రమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి తల్లి వజ్రమ్మ దశదినకర్మ కార్యక్రమాన్ని ఆదివారం జగదేవ్‌పూర్ పట్టణంలో కేశిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రులు, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు హాజరై వజ్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామరాజు సబ్బుబిల్లపై వజ్రమ్మ చిత్రాన్ని గీసి ప్రతాప్‌రెడ్డికి అందజేశారు.

ఎల్ఐసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

హుస్నాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ఎల్ఐసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బానోతు సర్వర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా గుండ సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా దరిపెల్లి రాజు, కక్కెర్ల మల్లిఖార్జున్, ఒడ్నాల బాల్‌లింగం, సహాయ కార్యదర్శిగా భూక్య ఈర్యానాయక్, ప్రచార కార్యదర్శిగా జూపాక అంజయ్య, కోశాధికారిగా బద్దిపడగ పాపిరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా గూళ్ళ రాజు, జెట్టి వెంకటస్వామి, గౌరవ సలహాదారులుగా నిమ్మల నారాయణరెడ్డి, వేముల నరసింహస్వామి, కల్వల రాజిరెడ్డిలను ఎన్నుకున్నారు.

'రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులే'



మాచేపల్లిలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కొండాపూర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దొరలకు, జమీందారులకు, నిజాం నిరంకుశ రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు చేసింది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అతిమేల మాణిక్ పేర్కొన్నారు. ఆదివారం కొండాపూర్ మండలం గంగారంలో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. అలాగు మారేపల్లి, గంగారం, మాచేపల్లి రెవెన్యూ పరిధిలో సన్న, చిన్నకారుల రైతుల భూముల నుంచి ట్రిపుల్‌ఆర్ పనులకు సర్వే చేయకూడదంటూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ ట్రిపుల్‌ఆర్ నిర్మాణ పనులకు సామాన్య మధ్యతరగతి రైతుల నుంచి బలవంతపు భూసేకరణ చేయవద్దన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా భూమిని నమ్ముకొని కుటుంబాలను పోషిస్తున్న రైతుల భూముల్లోంచి రోడ్డు నిర్మాణాలను ఆపివేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య, సభ్యులు బాబురావు, ప్రవీణ్, రామ్‌చరణ్, అంజనేయులు, అనిల్, సద్దాం, అర్జున, రైతులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు సుమారు 45 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపైకి వచ్చి సందడి చేశారు. ఆదివారం ఎస్సెస్సీ 1981-82 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో ఆత్మీయ సమావేశాన్ని జరుపుకుని చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. నాడు తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు కోటయ్య, రామకృష్ణారెడ్డిలను ఘనంగా సన్మానించారు.

- సిద్ది పేట అర్బన్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి)

కర్ర శ్రీహరి మరణం పేద ప్రజలకు తీరని లోటు



కర్ర శ్రీహరి చిత్ర పటం ఎదుట నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీహరి అకాల మృతి పేద ప్రజలకు తీరని లోటని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాదాపు 40 సంవత్సరాలు పాటు ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎంతోమంది పేదలకు ఎనలేని సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, లింగాల సాయన్న, బీలునాయక్, బద్దిపడగ రాజిరెడ్డి, కన్నోజు రామక్రిష్ణ, వికాస్, చిత్తారి శ్రీనివాస్, కైలాసం తదితరులున్నారు.

ఆసుపత్రుల్లో పనిచేసేవారికి కనీస వేతనం ఇవ్వాలి



మహాసభలో మాట్లాడుతున్న బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంపౌండర్స్ ఇతర సిబ్బందికి కనీస వేతనం ఇవ్వాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన మజ్దూర్ మహాసంఘ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ జిల్లా మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి కనీస వేతనం ఇవ్వాలని దసరా, దీపావళికి బోనస్ అందించాలని కోరారు. వారానికి ఒకరోజు సెలవు ఇవ్వడంతో పాటు డ్రెస్ కోడ్ అమలు చేసి అదనపు పనికి అదనపు వేతనాన్ని ఇవ్వాలంటూ పలు డిమాండ్లు చేశారు. మహాసభలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చామకూర రాజయ్య, కార్యదర్శి ముద్దం రాజిరెడ్డి, ప్రైవేట్ హాస్పిటల్ అసోసియేషన్ ఇన్‌చార్జి ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాక సరస్వతినగర్‌లోని మురుగు కాలువ దుస్థితి

ఆ రెండింటికే పరిమితమా..?

(5వ పేజీ తరువాయి)

ఈ ప్రతిపాదనలను ఆమోదించకుండా జాప్యం చేస్తోంది. పదిహేను రోజుల క్రితం సిద్దిపేట, గజ్వేల్ మున్సిపాలిటీలకు మాత్రమే డీపీఆర్ పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో జిల్లాకు రూ. 75 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రతిపాదనలు కోరిన ప్రభుత్వం ఇప్పుడు నిధులను రూ. 30 కోట్లకు కుదించి, కేవలం రెండు మున్సిపాలిటీల నుంచే డీపీఆర్‌లు తయారు చేయాల్సిందిగా ఆదేశించడం గమనార్హం. మిగతా మూడు మున్సిపాలిటీల్లో అభివృద్ధిపై అయోమయం నెలకొంది. హుస్నాబాద్ మినహా, దుబ్బాక, చేర్యాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ రెండు మున్సిపాలిటీలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో నిధుల కేటాయింపుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, బీఆర్ఎస్‌లో కీలకనేత హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటకు నిధులు కేటాయించడం గమనార్హం. దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీలకు నిధులు హుళక్కేనా? అని స్థానిక ప్రజలు, నాయకులు ఆందోళన చెందుతున్నారు.

ఈసారీ..!

(5వ పేజీ తరువాయి)

ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది.

మళ్లీ షార్ట్ టెండర్లు పిలుస్తాం

చేప విత్తనాన్ని సరఫరా చేసేందుకు టెండర్లను ఆహ్వానించగా.. సిద్దిపేట జిల్లాలో ఇద్దరు, సంగారెడ్డి జిల్లాలో ఒకరు పాల్గొన్నారు. మెదక్ జిల్లా నుంచి ఎవరూ టెండర్లు వేయలేదు. మరోసారి షార్ట్ టెండర్లు పిలవడానికి మత్స్య శాఖ కమిషనర్‌ను సంప్రదిస్తాం. త్వరలోనే మత్స్యకారులకు చేపపిల్లల్ని అందజేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

-మల్లేషం, మత్స్య శాఖాధికారి, మెదక్

పలు మండలాల్లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు

జిల్లాలోని పలు మండలాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శీతాకాల శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సిద్దిపేట రూరల్, అర్బన్ మండలాలతో పాటు చిన్నకోడూరు మండలాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలు నాటడం, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం తదితర సమాజహిత కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

- సిద్ది పేట రూరల్/ సిద్దిపేట కల్చరల్/ చిన్నకోడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేటలోని పొన్నాలలో విషజ్వరాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



సిద్దిపేట రూరల్: ర్యాలీ చేపట్టిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

- సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం సిద్దిపేట రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వనమహోత్సవం కార్యక్రమం కింద మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా సిద్దిపేట ఎన్ఎస్ఎస్ 4వ, 7వ విభాగాల ఆధ్వర్యంలో ఆదివారం వన మహోత్సవం కార్యక్రమాన్ని బుస్సాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ ప్రాముఖ్యతను తెలుపుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, ఫీల్డ్ ఆఫీసర్లు, అంగన్‌వాడీ వలంటీర్లు, మహిళా సంఘాలు, గ్రామస్తులు, స్థానిక విద్యార్థులు బుస్సాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.
- సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శీతాకాల శిబిరం కొనసాగుతున్నది. ఇందులో భాగంగా 5వ రోజు ఆదివారం పొన్నాల గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ విషజ్వరాల పట్ల అవగాహన కల్పించారు. డెంగ్యూ వంటి వైరల్ ఫీవర్స్ రాకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలను వలంటీర్లు వారికి వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ విద్యాసాగర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సామ సువర్ణాదేవి వలంటీర్లను అభినందించారు.
- చిన్నకోడూరు మండలం పెద్ద కోడూరు గ్రామంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతున్నది. ఈ స్పెషల్ క్యాంపును ఆదివారం తెలంగాణ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యాసాగర్ ఉస్మానియా యూనివర్శిటీ నుంచి వచ్చి సందర్శించారు. ఈ సందర్భంగా వలంటీర్లకు నేటి సమాజ పరిస్థితులు, సమాజంలో ఏ విధంగా పనిచేయాలో తదితర అంశాలపై అవగాహన కల్పించారు.